క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిశోర్

అర్వపల్లి : అర్వపల్లిలో రేణుక యల్లమ్మ తల్లి ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ మనీష, కదారి నరేష్‌యాదవ్, వట్టి వెంకన్న, ఎం. రాజలింగం, సంతు, వెంకన్న, యల్లంరాజు తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా రవికుమార్



మద్దిరాల : మండల పరిధిలోని ముకుందాపురం ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న కాట్ల రవికుమార్ మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా మంగళవారం నియమితులయ్యారు. ఎంఈఓగా తండు వెంకటనారాయణగౌడ్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో డీఈఓ ఆదేశాల మేరకు రవికుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

మంద కృష్ణ మాదిగను కలిసిన నాయకులు



మంద కృష్ణ మాదిగకు బొకే అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : పద్మశ్రీ అవార్డు పొందిన ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా తప్పెట్ల శ్రీరాములు మాట్లాడారు. ఈ నెల 7న జరిగే లక్ష డప్పులు వేల గొంతుకలు సభకు పూర్తి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి జాతిలో పుట్టిన ప్రతి ఒక్క మాదిగ బిడ్డ, మాదిగ ఉద్యోగులు, మాదిగ విద్యార్థులు, ప్రతి ఒక్కరూ సంకకు డప్పు తగిలించుకుని హైదరాబాద్‌కు తరలిరావాలన్నారు. కలిసిన వారిలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగడుపుల సూరయ్యమాదిగ, పుట్టల శ్రవణ్‌కుమార్ మాదిగ, వల్దాస్ శంకర్ మాదిగ, బొడ్డు మల్సూర్ మాదిగ, పిడమర్తి మధు మాదిగ, పంతం లింగయ్య తదితరులు ఉన్నారు.

వర్గీకరణ బిల్లును ఆమోదించడం హర్షణీయం

నూతనకల్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రివర్గ సబ్ కమిటీ ఆమోదించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల నాగమల్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదించడంతో పాటు రాబోయే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బత్తుల సురేష్, పంతం యాకయ్య, విజయ్‌కుమార్, గాంధీ, బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్ఐ మల్లయ్యకు సన్మానం



మల్లయ్యను సన్మానిస్తున్న ఎస్ఐ వీరన్న

మద్దిరాల : మండల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఎస్ఐగా పదోన్నతి పొందిన అనంతరం మొదటి సారి స్టేషన్‌కు వచ్చిన మల్లయ్యను మంగళవారం స్థానిక ఎస్ఐ వీరన్న సిబ్బందితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వసతిగృహం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం రాత్రి ఎంపీడీఓ ఎం. సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను, వంటగదిని, స్టోర్‌రూమ్‌ను, వంటలను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట హాస్టల్ వెల్ఫేర్ అధికారి కాటూరి రామానుజాచార్యులు, సిబ్బంది ఉన్నారు.

బోనస్ కోసం ఎదురుచూపు

- నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో జమకాని నగదు
- రైతు భరోసా రాక.. బోనస్ అందక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- స్పష్టత ఇవ్వని అధికారులు



తిరుమలగిరిలో ధాన్యాన్ని నింపుతున్న హమాలీలు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం పండిస్తే క్వింటాళ్‌కు రూ.500 బోనస్ ప్రకటిస్తామని చెప్పడంతో రైతులు ఈ వానాకాలం సీజన్‌లో అత్యధికంగా సన్న ధాన్యాన్ని సాగు చేశారు. అదే విధంగా రైతులు ఆ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా బోనస్ డబ్బులు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్దతు ధరతో కలిపి ఇస్తామన్న రూ.500బోనస్ ధాన్యం విక్రయించి రెండు నెలలైనా రైతుల ఖాతాల్లో జమ కావడం లేదు. గత వానాకాలం సీజన్‌లో దొడ్డు ధాన్యానికి మద్దతు ధర కంటే క్వింటాళ్‌కు మూడు, నాలుగు వందలు మాత్రమే తక్కువగా ఉండడంతో ధాన్యం ఆరబెట్టి తూర్పారబడితే ఆ మాత్రం ఖర్చు వస్తుందిలే ఇబ్బందులు ఎందుకని చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారు. కొందరు మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. సన్న ధాన్యానికి ప్రభుత్వం రూ.500 ఇస్తామని ప్రకటించడంతో రైతులు రోజుల కొద్ది కొనుగోలు కేంద్రాల్లో ఉండి విక్రయించారు. కాని బోనస్ మాత్రం కొంతమందికే వచ్చాయి. మరి కొందరికి రాకపోవడంతో రైతులు సింగిల్‌విండో, ఐకేపీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

57452 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు..

తిరుమలగిరి మండలంలో ఏడు సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాలలో 1276మంది రైతుల నుంచి 57452 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యానికి రూ.13కోట్ల 32లక్షల 90వేల 456లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ ధాన్యానికి రూ.500బోనస్, రూ.2కోట్ల 87లక్షల 26వేల 400లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. కాని కొంతమంది రైతుల ఖాతాల్లోనే బోనస్ జమ అయ్యింది. మిగతా వారికి జమ కాలేదు. ప్రభుత్వం బోనస్ వస్తుందని చెప్పడంతో కొనుగోలు కేంద్రాల్లో అమ్మామని, లేని పక్షంలో ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయిస్తే తమ చేతికి ఎప్పుడో డబ్బులు వచ్చేవని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

రూ.15వేల బోనస్ రావాలి



తాటిపాముల ధాన్యం కొనుగోలు కేంద్రంలో 30క్వింటాళ్ల సన్న ధాన్యం విక్రయించాను. మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.2320 చొప్పున డబ్బులు ఖాతాల్లో జమఅయ్యాయి. రూ.500చొప్పున బోనస్ రూ.15,000 రావాల్సి ఉంది. రెండు నెలలైనా బోనస్ ఇప్పటి వరకు రాలేదు.

– ఐల నర్సయ్య, రైతు, తాటిపాముల

అధికారులు స్పందించి బోనస్ ఇప్పించాలి



ఈ సారి ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాళ్‌కు రూ.500 బోనస్ ఇస్తుందంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాను. నాకు రూ.22వేల బోనస్ రావాలి. అధికారులు స్పందించి వెంటనే బోనస్ వచ్చే విధంగా చూడాలి.

– వంగూరి మల్లేష్, రైతు

‘లక్ష డప్పులు.. వేల గొంతులు’ను జయప్రదం చేయాలి



అర్వపల్లి : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అర్వపల్లి : హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే లక్ష డప్పులు.. వేల గొంతులు సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులుమాదిగ కోరారు. అర్వపల్లిలో మంగళవారం లక్ష డప్పులు.. వేల గొంతుల సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ పాల్వాయి పరుషరాములు, కుంకుడుపాల రవీందర్, మచ్చ నర్సయ్య, కె.శ్రీనివాస్, రవిశంకర్, ఈదుల వీరపాపయ్య, శైలేందర్, విష్ణు, సైదులు, దయాకర్, మహేష్, అల్లయ్య, సంజీవ, నాగార్జున, సైదులు, విజయ్, శేఖర్, ప్రసాద్, సైదులు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ ‘లక్ష డప్పులు – వేల గొంతులు’ సభను విజయవంతం చేయాలని సామాజిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము సభకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ ఎన్నో ఉద్యమాలు చేశారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ చేయాలన్నారు. ఆయన వెంట కందుకూరి ప్రవీణ్, వంగరి బ్రహ్మం, రెహమాన్ అలీ, ఉదయ్, రంజిత్, వెంకన్న, మల్లయ్య, రమేష్, నవీన్, మధు తదితరులు ఉన్నారు.



తిరుమలగిరి (తుంగతుర్తి) : సమావేశంలో మాట్లాడుతున్న కొత్తగట్టు మల్లయ్య

7న సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తుంగతుర్తి : మండల పరిధిలోని కర్విరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో నేటి నుంచి ఈ నెల 8వతేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 5న గ్రామతోరణం, ద్వార తోరణం, గంగానయనం, గోపూజ, గణపతి పూజ, స్వామి ప్రతిష్ఠ విగ్రహాలకు జలాదివాసం, 6న సుప్రభాత సేవ, విగ్రహాలకు పంచామృతాభిషేకం, గ్రామోత్సవం, హోమం, బలిహరణ, అష్టదిగ్బంధనం, ధన్యాదివాసం, 7న గణపతి పూజ, పుణ్యాహవచనం, భూమి పూజ, సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ, నాభిశిల (బొడ్రాయి), 8న సీతారామచంద్రస్వామి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విలీన సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయగిరి

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలో జరిగే రెండు అరుణోదయల రాష్ట్ర స్థాయి విలీనసభను జయప్రదం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయగిరి, కంచనపల్లి సైదులు కోరారు. మంగళవారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2013లో చీలిన అరుణోదయ సంస్థలు రెండు సూర్యాపేటలో ఏకం కానున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రొఫెసర్ ఖాసీం హాజరు కానున్నట్లు, సభకు పెద్దఎత్తున కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అరుణోదయం జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, బొల్క పవన్, భరత్ పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో రథసప్తమి వేడుకలు




తిమ్మాపురం సూర్యక్షేత్రంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురంలో గల అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో మంగళవారం రథసప్తమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు చేశారు. అనంతరం సూర్యాపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7గంటల ప్రాంతంలో సూర్యభగవానుడి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు కిరణాలను దర్శించుకున్నారు. కాగా స్వామి దర్శనానికి మధ్యాహ్నం వరకు భక్తులు క్యూలైన్లలో నిలుచున్నారు. కాగా క్షేత్రం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. అదే విధంగా ఆలయంలో సౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని రామకోటి స్థూపాలు, కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం క్షేత్ర ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఎస్ఐ బాలకృష్ణ, ఏఎస్ఐ రాములు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, గుడిపాటి కిరణ్, గుండా ప్రభాకర్, జైపాల్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, యాదగిరి, సైదులు, ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, ఆర్ఐ పాటి వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలేందర్‌రావు, వేద పండితుడు మార్తి శ్రీనివాసశర్మ, అర్చకులు భీంపాండే, అంకిత్‌పాండే, శ్రీరాంపాండే పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

నూతనకల్ : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తపల్లి అనంతరెడ్డి, మారగాని ముత్తయ్య, జక్కుల ఉప్పలయ్య, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, పాల్వాయి వెంకటమల్లు, రాంబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్దిరాల : కేంద్ర ప్రభుత్వం మధ్య తరగతి కుటుంబాలకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకుగాను బీజేపీ మండల అధ్యక్షుడు వద్దాణం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీహరి, వంగూరి రమేష్, శేఖర్, ఉపేందర్, నితిన్‌రెడ్డి, సతీష్, నాగరాజు, వెలుగు రమేష్, విక్రమచారి, తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రభుత్వం బీసీలను మోసం చేయడం తగదు



సూర్యాపేట : బీసీ లెక్కల ప్రతులను చెత్తబుట్టలో వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం కులగణన లెక్కల్లో బీసీలను తగ్గించి తప్పుగా లెక్కలు చూపించి బీసీలను మోసం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని రైతు బజార్‌లో గల అంబేద్కర్ విగ్రహం ముందు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ ఆధ్వర్యంలో బీసీ లెక్కల ప్రతులను చెత్తబుట్టలో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి కులగణనలో బీసీ జనాభా తగ్గించి ఓసీ జనాభా పెరిగినట్లు చూపించడం దారుణమని, ఈ రెడ్డి పాలనలో బీసీలపై కుట్ర జరుగుతుందన్నారు. బీసీ సబ్‌కమిటీలో భట్టి, పొన్నం ఉండాలి కానీ జానారెడ్డిని పెట్టడం దీని వెనుక పెద్ద కుట్ర ఉందని అర్థమైందని అన్నారు. కాంగ్రెస్ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకత ఉందని ఈ లెక్కల్లో లోపాలు ఉన్నాయని అధికారిక నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి భూపతి నారాయణగౌడ్, బండపల్లి శ్రీనివాస్, బత్తుల దశరథ, జక్కుల రామచందర్ యాదవ్, కోడి లింగయ్య యాదవ్, వైరు విజయకృష్ణ, తండు కృష్ణ, బంటు నాగేందర్, పగిళ్ల వెంకన్న, తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

సూర్యాపేటటౌన్ : విజ్ఞానశాస్త్ర ఫలాలను సామాన్య ప్రజలకు అందించడానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విశేష కృషి చేస్తుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో భాగంగా జనవిజ్ఞాన వేదిక ప్రత్యేకంగా తయారు చేసిన సైన్స్ క్యాలెండర్‌ను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కలిసి మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో రమేష్‌బాబు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్తల ఫొటోలు, వారి ఆవిష్కరణలతో కూడిన జేవీవీ సైన్స్ క్యాలెండర్‌ను జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు ఐతగోని రాంబాబుగౌడ్, బచ్చు పురుషోత్తం, పి.మల్లికార్జున్, వేణు, ఉయ్యాల నర్సయ్య, దుర్గం బాలు, తండు వెంకన్న, అజయ్‌తో పాటు జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి, మహిళా కార్యదర్శి భట్టు సునీత, పల్లె ఝాన్సీ, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెప్పుకోసమే ఎమ్మెల్యే సామేల్‌పై ఆరోపణలు

తుంగతుర్తి : కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా అగ్రవర్ణ నాయకుల మెప్పుకోసమే ఎమ్మెల్యే మందుల సామేల్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావులపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోత్కూర్‌లో జరిగిన పార్టీ సమావేశం ఎవరి ప్రయోజనాలు కోసమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే మందుల సామేల్ నిరంతరం ప్రజల మధ్య తిరుగుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఒక్కరిద్దరి ప్రయోజనాల కోసం సమావేశాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యే సామేల్ వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. స్వార్థప్రయోజనాలు వీడి ప్రతిఒక్కరూ కలికట్టుగా పనిచేసి పార్టీని కాపాడుకుందామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ చింతకుంట్ల బాబు, దాసరి శ్రీను, కలకోట్ల మల్లేష్, మంగళపల్లి నాగరాజు, అందే పరశురాం, చింతకుంట్ల సైదులు, వేణు, జనార్దన్, శ్రీను, యాదగిరి, ఎల్లయ్య, అశోక్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వర్ధెల్లి బుచ్చిరాములు



బుచ్చిరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : పేదల పెన్నిధి వర్ధెల్లి బుచ్చిరాములు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుచ్చిరాములు 6వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుచ్చిరాములు పేద కుటుంబంలో పుట్టి ఎర్రజెండా చేత పట్టి చిన్నతనంలోనే పోరాటాలకు దగ్గరయ్యాడని ఆయన అన్నారు. సూర్యాపేట ఆఫీస్ కార్యదర్శిగా పనిచేసి కొద్ది కాలంలోనే తుంగతుర్తి, సూర్యాపేట ఉమ్మడి డివిజన్ వ్యాప్తంగా కూలి, భూమి పోరాటాలు నడిపి పేద వర్గాలకు అండగా ఉద్యమాలు నిర్మించాడని తెలిపారు. 1989–95వరకు సూర్యాపేట తాలూకాలో జరిగిన నిర్బంధాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలు ఎదుర్కోవడంలో కార్యకర్తలకు మనోధైర్యం కల్పించడంలో బుచ్చిరాములు పాత్ర మర్వలేనిదన్నారు. మారుతున్న రాజకీయ పరిస్థితులు, మతోన్మాద ఉదారవాద విధానాలు ముందుకు వస్తున్న సందర్భంలో బుచ్చిరాములు లేకపోవడం పార్టీకి నష్టమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జె.నరసింహారావు, వేల్పుల వెంకన్న, పార్టీ వన్‌టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పిడమర్తి అశోక్, నందిపాటి సతీష్, యాతాకుల ప్రవీణ్, గోపి, మనోజ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న పావనికృపాకర్

సూర్యాపేట : ప్రతిఒక్కరూ టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూర్యాపేట 45వవార్డు మాజీ కౌన్సిలర్ పావనికృపాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యానగర్‌లో గండూరి రామస్వామి వాటర్ ప్లాంట్ వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీబీ నిర్ధారణ, బీపీ, షుగర్ పరీక్షల వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 2016లో అప్పటి సీఎం కేసీఆర్ తెలంగాణలో టీబీ వ్యాధిని అరికట్టాలనే ఉద్దేశంతో టీబీ వ్యాధి పరీక్షలు, నివారణకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారని, దాని ఫలితంగా టీబీ వ్యాధిని 75శాతం వరకు అరికట్టామన్నారు. కేంద్ర ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో టీబీ నిర్ధారణ పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా చేసి టీబీ పాజిటివ్ వచ్చిన వారికి మూడు నెలల పాటు మందులు ఇస్తారన్నారు. టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని లేకపోతే శరీరంలో వ్యాపించి జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మర్రి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, గుడిపూడి వెంకటేశ్వరరావు, బెజగం ఫణి, మట్టపల్లి రమేష్, బజ్జూరి శ్రీనివాస్, శివప్రసాద్, ఏకస్వామి, షుష్మా, వెంకట్, విజయ, మణెమ్మ, శ్రీలత, భిక్షం, సందీప్, కళ్యాణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన



తిరుమలగిరి (తుంగతుర్తి) : మాట్లాడుతున్న వైద్యాధికారిణి మల్లెల వందన

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారిణి మల్లెల వందన కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందికి, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశ కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, సూపర్‌వైజర్ స్వరూపాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్ కోరారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 10న నులిపురుగుల మాత్రల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, సూపర్‌వైజర్ వి.లలిత, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి సాగులో అధునాతన పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త నరేష్

చివ్వెంల(సూర్యాపేట): వరి సాగులో రైతులు అధునాతన పద్ధతులు పాటించాలని కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్, ఎ. కిరణ్ అన్నారు. మంగళవారం చివ్వెంల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్)–రాజేంద్రనగర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో వరి సాగు చేసే రైతులకు డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతులపై అవగహన కల్పించారు. సూర్యాపేట జిల్లాలోని రైతులకు నేరుగా విత్తే పద్ధతిపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నేరుగా విత్తడం వల్ల కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చునన్నారు. అదేవిధంగా యంత్రాల ద్వారా విత్తుకోవచ్చునన్నారు. కలుపు నివారణ, పురుగు మందుల పిచికారీ, తెగుళ్ల నివారణ, ఎరువుల యాజమాన్యం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. వెంకటేశ్వర్లు, ఏఈఓలు టి. ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

ఐక్యతతో పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పనిచేసి వచ్చే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాగారం గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కొరకు, 5నుంచి 9వతరగతి వరకు చదివే విద్యార్థులు గురుకుల ఎంట్రన్స్ పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడం, గ్రామంలోని పురాతన, పవిత్రమైన శివాలయానికి వెళ్లడానికి సీసీరోడ్డు, ప్రహరీ, మంచినీటి ట్యాంక్ నిర్మాణం చేయాలని, మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం సంత ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ, చిప్పలపల్లి మల్సూర్, బైరబోయిన మహేష్, కొమ్ము నరేష్, ఆకారపు కృష్ణ, కన్నెబోయిన లింగమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

నాగారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం మండలంలో నూతన ఓటర్ల చేర్పుల జాబితాపై ఎంపీడీఓ కె.మారయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఓటరు జాబితాపై రాజకీయ నాయకులను సలహాలు, సూచనలు, అభ్యంతరాలు స్వీకరించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఆకుల బుచ్చిబాబు, కూరం వెంకన్న, ఎర్ర రాంబాబు, కుమార్, నవీన్, లింగయ్య, యాదయ్య, బాలరాజు, యాకూబ్‌వలీ, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, సర్వద్‌పాషా, కార్యదర్శులు ఉన్నారు.

అర్వపల్లి : గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సవరణ, కొత్తగా నమోదైన ఓటర్లపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో 24,540మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ పి.గోపి తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు వజ్జె శ్రీనివాస్, కూర శంకర్, సీహెచ్.లక్ష్మణ్, శిగ వెంకన్న, జూనియర్ అసిస్టెంట్ శిల్పిక తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన ఓటరు లిస్టుపై నాయకుల సలహాలు, సూచనలు, అభ్యంతరాలను తెలుసుకున్నారు. సమావేశంలో ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

తుంగతుర్తి : గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని మాజీ సర్పంచులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుండగా మండల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు యాకునాయక్, ఈరోజీ ఉన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాలని కోరుతూ చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను, అదే విధంగా సమస్యలు పరిష్కరించాలని వెళ్తున్న వీఆర్ఏలను మంగళవారం మండల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్‌లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పెండింగ్ బిల్లుల విడుదల చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆకుల వీరయ్య, రవీందర్, దేవా, శ్రీనివాస్, రవీందర్, బాబు, వీరయ్య పాల్గొన్నారు.